# 9. తెలుగు టి.వి. "వాదన"

రావి కొండలరావు గారు "తెలుగు మేష్టారు" ని కేరికేచర్ చెయ్యడం వినివున్న వాళ్లకి అందులో ఒక చిన్న "టిప్పు" కొందరికి గుర్తుండే ఉంటుంది. అదేంటంటే-

(దానికి ముందు ఇంకో చిన్న "టిప్పు" సంగతి చెప్పాలి.-)

సినిమా పరిభాషలో "డిస్కషన్" అని ఒకటుంది. రాత్రి ఏ పదిగంటలకో పదకొండుకో, ఎవరో ప్రొడక్షన్ ఆఫీసుకి వస్తారు; లేదా ఫోన్ చేస్తారు! ఫలానా డైరెక్టరు గారు ఫలానా ప్రొడ్యూసర్‌గారు ఎక్కడున్నారెక్కడున్నారంటూనూ.

"కథ మీద డిస్కషన్‌లో ఉన్నారండీ!" అని జవాబు వస్తే దాని అర్థం వేరు. అందరూ "కథ"లో ఒక ఘట్టం మీదనో లేక యావత్తు కథమీదనో చర్చలో ఉన్నారని - వినగానే తట్టే అర్థం. కాని, అసలర్థం - వాళ్లంతా మందు పార్టీలో ఉన్నారని. (దీన్ని "కథమీద కూచోడం" అని కూడా అంటారు.)

కొండలరావుగారు ఓ సారి తన మిత్రుడూ, ప్రఖ్యాత దర్శకుడూ అయిన "బాపు" గారిని - "రాత్రి మీ ప్రోగ్రాం ఏమిటి?" అని అడిగారట.

"రాత్రా?.... రాత్రీ.... అదే - ఫలానా పిక్చర్స్‌వారి రాబోయే చిత్రం గురించి బాబూరావు గారితోను, సుబ్బారావు గారితోను డిస్కషన్ వుంది."

" ప్చ్! వాళ్లతో మనకెందుకు చెప్పండీ, లేనిపోని డిస్కషన్! నామాట విని వెళ్లడం మానీండి" అన్నారట కొండలరావుగారు; తెలుగుమాష్టారి అవతారం తనే ధరించిన ధోరణిలో; బాపుగారు వాడిన "డిస్కషన్"కి అనే మాటకి వాదన అనే అర్థం తీసి, వాళ్లతో మనకెందుకు, ఆర్గుమెంటు - అన్నాడన్నమాట.

మా ప్రియమైన హైదరాబాదు టి.వి. ఎనౌన్సర్లు "వాదన" అనే మాటని ఇంకో అర్థంలో వాడడం విన్నాను (చూశాను కూడా. టి.వి.తో వచ్చిన చిక్కే అది కదా. కళ్లూ, చెవులూ రెండు సెట్లూ వప్పగించేసి, ఇష్టం వున్న స్త్రీ రేప్ కేసులో పాల్గొన్నట్టు నిస్సహాయంగా కూచోవాలి).

వారు "వాదన" అనే మాటను "వాదనము" అనే సంస్కృతం మాటనుంచి తెచ్చేరు. ఈ తేవడం కూడా, మా డాక్టరు గారు ఆసీలుమెట్ట జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్లవలసి వచ్చినపుడు దొండపర్తి ద్వారా కాకుండా జగదాంబా జంక్షన్ ద్వారా వెళ్లినట్టు, సంస్కృతం మాటకి తెలుగు ప్రయోగం, హిందీ అర్థం ద్వారా తెచ్చేరు. (సంస్కృతంలో నిధనమ్ హిందీలో నిధన్ అయింది, జననమ్-జనన్, కారణమ్-కారణ్, సదనమ్-సదన్, అలాగ అనేకం) దాన్ని గురించే నా ఈ వాదన.

"ఇపుడు -స్వర్గీయ శ్రీ - ఖాన్ గారి సితార్ వాదన" అని అనౌన్స్ చేస్తారు.

"ఖాన్‌గారు" కదా, మరణించేక స్వర్గీయ - అవుతారా లేక వారి మతం నిర్దేశించిన

ఇంకో లోకానికి వెళతారా అనే విషయం గురించి గానీ, కీర్తిశేషులైన వారి పట్ల శ్రీ అనే మర్యాదార్థకం వాడాలా అనే విషయం గురించి గాని కాదు, నా వాదన. "వాదన" అనే మాటని వాద్య సంగీతం అనే అర్థంలో ఆరుకోట్ల మంది ఆంధ్రుల మీద ప్రయోగించి తెలుగు వాళ్లనీ తెలుగు భాషనీ చితక్కొట్టెయ్యొచ్చునా అనే పాయింటు మీదనే, నా వాదన.

ఏదో, మనం మనం తెలుగు వాళ్లం కదా, సగం చదువుల వల్ల ఏవో పొరబాట్లు చేస్తాం గనక సద్దుకుపోదాం అని రెండు ఉత్తరాలు ఈ విషయమై రాశాను గాని నేను ఆశించిన మార్పు రాలేదు. అందుచేత వాదన పెట్టుకోడానికే నిశ్చయించుకున్నాను. అది, మొన్న హైదరాబాదు వెళ్లినపుడు కాకతాళీయంగా సాధ్యపడింది.

"ఎలాగంటే, మా 'కజిన్ బ్రదర్' విశ్వనాథం (చూసేరా, నేను కూడా తప్పు ప్రయోగం చేసేను!) రేడియో ఆఫీసులో పనిచేస్తున్నాడు కదా వాణ్ని అడిగాను 'రాత్రి నీ ప్రోగ్రాం ఏమిటి' అని. వాడు "టి.వి. వాళ్ళతో డిస్కషన్" అన్నాడంటే 'వాళ్లతో మనకెందుకు డిసకషన్, బ్రదర్' అనడానికి నేను రావికొండలరావుని కాదు. "అయితే నేనూ వస్తాను" అనేద్దును. కాని వాడేమో "మా టి.వి. యూనిట్‌లో పనిచేసే ఒక అబ్బాయికి పెళ్ళి" అన్నాడు. "అక్కడికి అనౌన్సర్లు వస్తారా?" అన్నాను. "మరి, రారా? అన్నాడు. "ఐతే నేను వస్తా" నని వెంటపడ్డాను.

పెళ్లిళ్లలో జరిగేది తెలుసుకదా. వెళ్తే ఎవరూ ఎట్టించుకోరు. వెళ్లకపోతే పట్టించుకుంటారు. జవాబులు కార్యక్రమంలో పాల్గొనే ఇద్దరు (మగ) అధికార్లని పోగుచేసి నా వాదన కొనసాగించేను.

"మీరు వీణావాదన, ఫిడేలు వాదన, వేణు వాదన, మృదంగ వాదన అని ఎనౌన్స్ చెయ్యకూడదని, వాటికి బదులుగా వీణా వాద్య కచేరీ అనీ వయొలిన్ వాద్యం, వేణు గానం అనాలని నేను రెండు ఉత్తరాలు రాసేను. మార్పు రాలేదు" అన్నాను.

"మేం సాధారణంగా టి.వి. కార్యక్రమాలు బావున్నాయని వచ్చే ఉత్తరాలే చదువుతాం" అని సమాధానం.

"చదవమని ఎవడేడిశాడు? మార్పు రాలేదేమని అడుగుతున్నాను" అన్నాను. "వాద్య సంగీతాన్ని వాదన అంటారేం మీరు?" అని గట్టిగా అడిగాను.

"హిందీలో సితార్ వాదన్, వీణా వాదన్ అని ఉంటాయి. వాటిని తెలుగులో సితార్ వాదన, వీణా వాదన అంటున్నాం. ఎందుకంటే హిందీ మనకి "రాష్ట్రీయ భాష" రాష్ట్రీయ అంటే తెలుసుగా, జాతీయ అని అర్థం. పైగా మాకు ప్రమోషన్లు ఢిల్లీ ఆఫీసు నుంచి రావాలి. అందుకని వీలున్నంత వరకు తెలుగు భాషనీ, తెలుగు గ్రామర్‌ని హిందీకి తాకట్టు పెట్టాలి మరి."

"వాదన అంటే తెలుగులో చర్చ అనీ, వాదోపవాదాల కూర్పు అనీ మీరు గ్రహించడానికి ఇంకా ఎన్నేళ్లు పడ్తుంది?"

"ఎన్నేళ్ళయినా అవనీండి. మావన్నీ పర్మనెంటు పోస్టులు!"

ఇంక వీళ్ళతో వాదన అనవసరం అని నేను వచ్చేశాను. ★